క్లుప్తంగా

'ఆ అర్హత కాంగ్రెస్ నేతలకు లేదు'



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

చింతలమానెపల్లి: సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు గురించి మాట్లాడే అర్హత కాంగ్రెస్ నేతలకు లేదని గంగాపూర్, ఖర్జెల్లి ఎంపీటీసీలు చాప్లె రోజా, చౌదరి కల్పన అన్నారు. మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. మూడుసార్లు పోటీ చేసినా డిపాజిట్ దక్కని కాంగ్రెస్ నాయకుడు రావి శ్రీనివాస్ ఎమ్మెల్యే హరీశ్‌బాబు గురించి మాట్లాడటం సరికాదన్నారు. ఎమ్మెల్యే, కుటుంబ సభ్యుల తోపాటు బీజేపీ నాయకుల గురించి అవాకులు, చవాకులు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. దొంగ రాజకీయాలు చేస్తూ మాట్లాడటం మానుకోకపోతే తగినరీతిలో బుద్ధి చెబుతామన్నారు. ఎమ్మెల్యేగా పోటీచేసి ఓడిన కోనేరు కోనప్ప మూడు నెలలు కూడా ఉండలేక అధికార పార్టీలో చేరారన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కొంపరి బాలాజీ, చాప్లె సుధాకర్, చౌదరి రంగన్న, సిహెచ్ రాజన్న, కుకడ్కార్ రమేశ్, చౌదరి చందు, డుబ్బుల మురళీ, శ్రీమన్నారాయణ, నాగపురె మోహన్, దస్నూరి సాయి పాల్గొన్నారు.

పాఠశాలలో వీడ్కోలు వేడుక



పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

రెబ్బెన: మండలంలోని లేతన్‌గూడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. 5వ తరగతి పూర్తిచేసుకుని పాఠశాలను వీడి వెళ్తున్నవారికి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపన్యాసాలు, నృత్యం చేసి ఆకట్టుకున్నారు. హెచ్‌ఎం రవికుమార్, ఉపాధ్యాయుడు సాయికృష్ణ పాల్గొన్నారు.

ఘనంగా హనుమాన్ జయంతి



జెండా ఎగురవేస్తున్న భక్తులు

ఆసిఫాబాద్: జిల్లాకేంద్రంలోని జన్కాపూర్ అంజనేయస్వామి ఆలయంలో హనుమాన్ జయంతిని సోమవారం ఘనంగా జరుపుకున్నారు. ఆనవాయితీగా ప్రతిఏటా ఒకరోజు ముందుగా నిర్వహించే వేడుకల్లో భాగంగా ఆలయం ముందు జెండా ఎగురవేశారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి, అన్నదానం చేశారు. కార్యక్రమంలో అర్చకులు మసాదే రాంచందర్, రవి, నరేశ్, రాకుశ్, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నేడు హనుమాన్ శోభాయాత్ర

దహెగాం: హనుమాన్ జయంతిని పురస్కరించుకొని మండల కేంద్రంలో మంగళవారం శోభాయాత్ర ఉంటుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ యాత్ర స్థానిక శివాలయం నుంచి ప్రారంభమై ప్రధాన వీధులగుండా పాత హనుమాన్ ఆలయం వరకు కొనసాగనుందని పేర్కొన్నారు. భక్తులు, యువకులు పాల్గొనాలని కోరారు.

పెంచికల్‌పేట్: మండల కేంద్రంలోని హనుమాన్ విగ్రహాన్ని ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో సిద్ధం చేశారు. ఈ విగ్రహం నుంచి ప్రధాన వీధుల గుండా శోభాయాత్ర నిర్వహించనున్నట్లు కమిటీ నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమానికి హిందూ బాంధవులు తరలిరావాలని కోరారు.

ఘనంగా మడేలయ్య విగ్రహ ప్రతిష్ఠాపన



పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్న భక్తులు

దండేపల్లి: మండలంలోని మాదాపూర్‌లో నూతనంగా నిర్మించిన శ్రీ మడేలయ్య ఆలయంలో సోమవారం విగ్రహ ప్రతిష్ఠాపన పూజా కార్యక్రమాలు వైభవోపేతంగా జరిగాయి. ఇటిక్యాలకు చెందిన వేదపండితులు శ్రీ గొల్లపెల్లి శ్రీధరాచార్యులు, శ్రీరామానందస్వామి ఆధ్వర్యంలో ప్రతిష్ఠాపన కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. రజక సంఘం నాయకులు, కులస్తులు పాల్గొని మడేలయ్యకు ప్రత్యేక పూజలు చేశారు.

తవ్వారు.. వదిలేశారు..



ఈ ఫొటోలో కనిపిస్తున్న గుంత వాంకిడిలోని సర్వీస్ రోడ్డుకు ఆనుకుని ఉంది. సైడ్ డ్రెయిన్ నిర్మాణ కోసం ఆరు నెలల క్రితం జేసీబీతో గుంత తవ్వి అలాగే వదిలేశారు. దాని పక్కనే బస్‌షెల్టర్ నిర్మించారు. మహారాష్ట్ర వైపు నుంచి వచ్చే బస్సులు ఇక్కడే నిలువుతారు. బస్సు కోసం పరుగున వెళ్లే ప్రయాణికులు ఆ గుంతలో పడే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

- సైడ్‌డ్రెయిన్ నిర్మాణంలో నిర్లక్ష్యం
- నెలలు గడిచినా పూర్తికాని పనులు
- ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు



సర్వీస్ రోడ్డు పక్కన ప్రమాదకరంగా గుంత

వాంకిడి: మండల కేంద్రం గుండా నిర్మించిన నాలుగు వరుసల జాతీయ రహదారి 363 నిర్మాణంలో జరుగుతున్న జాప్యానికి ప్రయాణికులు, వాహనదారులు, దుకాణాల యజమానులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. అధికారుల పర్యవేక్షణ లేకపోవడం, నిర్మాణ పనుల్లో కాంట్రాక్టర్ జాప్యం కారణంగా ఏళ్లు గడుస్తున్నా పూర్తి కావడం లేదు. రహదారి నిర్మాణంతో మండల కేంద్రంలో పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారడంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. అయినా సైడ్ డ్రెయిన్ నిర్మాణంపై కాంట్రాక్టర్లు నిర్లక్ష్యం వీడటం లేదు. గత రెండేళ్లుగా సర్వీస్ రోడ్డు గుండా నిర్మించాల్సిన మురుగుకాల్వలు అసంపూర్తిగా వదిలేయడంతో ప్రతీ వర్షాకాలం కాలువల్లో మురుగు వరద నీరు ఇళ్లలోకి చేరుతోంది. ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రమాదకరంగా గుంతలు..



ఆటోస్టాండ్ వద్ద గుంత

మండల కేంద్రంలోని మహారాష్ట్ర వైపు నుంచి వచ్చే బస్సులు నిలుపు ప్రాంతంలో గత ఆరు నెలల క్రితం తవ్విన గుంతలు ఇప్పటికీ పూడ్చలేదు. ఆ ప్రాంతంలో మూడు చోట్ల అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణంలో భాగంగా పెద్ద సిమెంట్ పైపులు వేసేందుకు భారీ గుంతలు తవ్వారు. కాని వాటి పనులు పూర్తి చేయకపోవడంతో ప్రమాదకరంగా మారాయి. స్థానికులతోపాటు ఆసిఫాబాద్ వైపు వెళ్లే ప్రయాణికులు బస్సులు, ఆటోల కోసం ఈ ప్రాంతంలో వేచి చూస్తుంటారు. దుకాణ సముదాయాలు ఉండటంతో ఈ చోట జనాలు అధికంగానే ఉంటారు. అయితే ఆ గుంతల వద్ద ప్రమాద సూచిక లేకపోవడంతో ప్రమాదాలు జరిగే అవకాశం లేకపోలేదు. ప్రజాప్రతినిధులు స్పందించి సైడ్ డ్రెయిన్ పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

చర్యలు తీసుకోవాలి



ఆయుర్వేదిక్ ఆస్పత్రి సమీపంలోని భవనంలో ఒక రూమ్ అద్దె తీసుకున్నా. ఇందులో జనరల్ స్టోర్ నిర్వహిస్తున్నా. సైడ్ డ్రెయిన్ కోసం షాపు ముందు ఆరునెలల కింద గుంత తవ్వారు. ఇప్పటికి పని పూర్తి చేయలేదు. షాపునకు జనాలు రావాలంటే ఇబ్బందిగా మారింది. అధికారులు స్పందించి పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలి. – బందారే కృష్ణ, దుకాణ యజమాని, వాంకిడి

గుంత పూడ్చివేయాలి



సర్వీస్ రోడ్డు పక్కన సైడ్ డ్రెయిన్ కోసం తవ్విన గుంతలు ప్రమాదకరంగా మారాయి. బస్‌షెల్టర్, ఆటో స్టాండ్ అదే ప్రాంతంలో ఉంది. జనం రద్దీ ఉండే చోట గుంత పూడ్చడం లేదు. ఏమైనా ప్రమాదం జరిగే అవకాశం ఉంది. అధికారులు స్పందించి గుంత పూడ్చి వేసేలా చర్యలు తీసుకోవాలి.

– నిమావత్ మినేష్, వాంకిడి

మినీ స్టేడియంలో పారిశుధ్య పనులు

కౌటాల: కౌటాల మినీ స్టేడియంలో సోమవారం కార్మికులు పారిశుధ్య పనులు చేపట్టారు. ఆదివారం సాక్షిలో 'మందు బాబుల అడ్డా' శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. కౌటాల పంచాయతీ కార్యదర్శి ఎస్.సాయికృష్ణ ఆధ్వర్యంలో పంచాయతీ కార్మికులు మినీ స్టేడియంలో మందు బాటిళ్లు, చెత్త చెదారాన్ని తొలగించారు. ఇండోర్ భవనం, విశ్రాంతి భవనాల్లోని చెత్తను శుభ్రం చేశారు. రెండు రోజుల్లో మినీ స్టేడియానికి గేట్ ఏర్పాటు చేస్తామని ఆయన తెలిపారు.

సాక్షి స్పందన



మద్యం బాటిళ్లు, చెత్తను తొలగిస్తున్న కార్మికులు

ఉపాధి డబ్బులు చెల్లించాలని నిరసన

జైనూర్: ఉపాధి డబ్బులు చెల్లించాలని సోమవారం జైనూర్ తపాలా కార్యాలయం ఎదుట కూలీలు నిరసనకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధి పథకంలో కూలీలు చేసిన పనులకు ప్రభుత్వం వేతనాలు ఖాతాల్లో జమ చేసిన బీపీఎంలు అందించడం లేదన్నారు. వెంటనే తపాలాశాఖ సిబ్బంది చర్యలు చేపట్టాలని కోరారు. ఈ విషయమై బీపీఎంను వివరణ కోరగా ఉపాధి ఆన్‌లైన్ అప్‌డేషన్ గత రెండు రోజులుగా ఉండటంతో కూలీల వేతనాలు తిరిగి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తిరిగి ప్రభుత్వ ఖాతాల్లో చెల్లిస్తామన్నారు.



నిరసన తెలుపుతున్న ఉపాధి కూలీలు

చలివేంద్రం ప్రారంభం



ప్రారంభిస్తున్న తహసీల్దార్ వెంకటేశ్వర్‌రావు

పెంచికల్‌పేట్: తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని తహసీల్దార్ వెంకటేశ్వర్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండ తీవ్రత నేపథ్యంలో కార్యాలయానికి వచ్చే ప్రజల కోసం చలివేంద్రాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. ఆర్‌ఐ గోపాల్, సురేష్, కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

ఉపాధి పని సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో క్రిష్ణారావు

కెరమెరి: ఉపాధి పనులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో క్రిష్ణారావు అన్నారు. మండలంలోని మోడి పంచాయతీలోని పలు గ్రామాల్లో సోమవారం ఆయన ఉపాధి కూలీలతో మాట్లాడారు. జాబితాలో ఉన్న ఇష్టమైన పనులు చేసుకోవచ్చని జాబ్‌కార్డు ఉన్నవారు ఉపాధి పనికి వెళ్లాలన్నారు. ఏపీవో మల్లయ్య, కార్యదర్శి ధర్మయ్య ఉన్నారు.

పుస్తకపఠనంపై దృష్టిపెట్టాలి

రెబ్బెన: వేసవి సెలవుల్లో సమయాన్ని వృథా చేయకుండా విద్యార్థులు పుస్తకపఠనంపై దృష్టిపెట్టాలని తక్కళ్లపల్లి జెడ్పీహైస్కూల్ హెచ్‌ఎం మహేశ్వర్ రావు అన్నారు. పాఠశాలలో విద్యార్థులకు పుస్తక పఠనంపై సోమవారం అవగాహన కల్పించారు. రూం టూ రీడ్ సంస్థ రూపొందించిన లిట్రసీ క్లౌడ్ వెబ్‌సైట్ ఉపయోగించి ప్లాట్ పానెల్స్‌పై ఇంగ్లిష్, తెలుగు భాషల్లో పఠన కృత్యాలు పిల్లలకు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి సెలవుల్లో పిల్లలు కథల పుస్తకాలు చదువుకోవడం ద్వారా వారిలో ఆలోచన, ఊహాశక్తి, రచన ఆసక్తిని పెంపొందించుకోవచ్చని అన్నారు. రూం టూ లెర్న్ యూట్యూబ్ చానెల్‌ని సబ్‌స్క్రైబ్ చేసుకోవడం ద్వారా తల్లిదండ్రులు తమ పిల్లలతో అభ్యాసన ప్రక్రియల్లో భాగస్వాములవ్వాలని అన్నారు. ఈ వెబ్‌సైట్‌లో ఇంగ్లిష్ భాషలో 407, తెలుగులో 118 కథల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. సీఆర్పీ సత్యనారాయణ, ఉపాధ్యాయులు అర్జున్‌రెడ్డి పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న హెచ్‌ఎం మహేశ్వర్‌రావు

డీలర్లు నిబంధనలు పాటించాలి

కౌటాల(సిర్పూర్): ఎరువుల దుకాణాల డీలర్లు నిబంధనలు పాటించాలని కాగజ్‌నగర్ వ్యవసాయ శాఖ సహాయ సంచాలకుడు జాటోత్ మనోహర్ అన్నారు. మండల కేంద్రంలోని పలు ఎరువుల దుకాణాలను సోమవారం తనిఖీ చేశారు. రిజిస్టర్లు పరిశీలించి స్టాక్ వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పీవోఎస్ ద్వారానే ఎరువులు విక్రయించాలన్నారు. గడువు ముగిసిన ఎరువులు, మందులు నిల్వ ఉంచొద్దని సూచించారు. అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట ఏవో రాజేశ్ తదితరులు ఉన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

ఆత్రం సక్కు గెలుపునకు కృషిచేయాలి

దహెగాం: పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు గెలుపునకు ప్రతీ కార్యకర్త కృషి చేయాలని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండె విఠల్ అన్నారు. మండలంలోని మొట్లగూడ, రాంపూర్, దిగడ గ్రామాల్లో సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పలువురికి పార్టీ కండువ కప్పారు. అనంతరం మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీల అమలులో విఫలమైందని ఆరోపించారు. బీఆర్‌ఎస్‌లో రైతులకు అన్ని సంక్షేమ పథకాలు అందయన్నారు. ఎంపీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పని చేయాలన్నారు. కార్యక్రమంలో షాకీర్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.



పార్టీలో చేరిన కార్యకర్తలతో ఎమ్మెల్సీ విఠల్

లక్ష్మీనరసింహస్వామి విగ్రహ ప్రతిష్ఠ

మందమర్రిరూరల్: పట్టణంలోని ఊరు రామకృష్ణపూర్ ఏరియాలో సోమవారం లక్ష్మీనరసింహస్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు బొంతు రమేష్–శారద, తూటి సతీష్–మమత దంపతులు ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. లక్ష్మీనరసింహస్వామి ఆలయ ప్రాంగణంలో మహా గణపతి, వీర హనుమాన్, నాగసుబ్రహ్మణ్యస్వామి, నవగ్రహధ్వజ స్థంభ కనుకదుర్గాదేవి విగ్రహాలను కూడా ప్రతిష్ఠించినట్లు తెలిపారు. అనంతరం అన్నప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు సముద్రాల సంతోష్‌చారి, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



ప్రత్యేక పూజలో పాల్గొన్న ఆలయ నిర్వాహకులు

మహిళా సాధికారతపై అవగాహన

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మహిళా సాధికారక హబ్ జెండర్ స్పెషలిస్టు మౌనిక, ఫైనాన్షియల్ లిటరసీ లిప్సికలు మహిళా సాధికారతపై సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బేటీ బచావో, బేటీ పడావో పథకం, లింగ వివక్షత, లింగ సమానత్వం, బాల్య వివాహాల నిరోధక చట్టం, సైబర్ క్రైం, మహిళా హెల్ప్‌లైన్ 181 నంబర్లపై అవగాహన కల్పించారు. కళాశాల ఇంచార్జి శ్రీధర్, విద్యార్థులు పాల్గొన్నారు.

ముస్తాబైన ఆలయాలు

- నేడు హనుమాన్ జయంతి
- పలు ఆలయాల్లో ఏర్పాట్లు పూర్తి



కొలువైన వీరాంజనేయుడు



ముస్తాబైన కేస్లాపూర్ హనుమాన్ ఆలయం

ఆసిఫాబాద్/ఆసిఫాబాద్‌అర్బన్: హనుమాన్ జయంతిని పురస్కరించుకొని పలు ఆలయాలు ముస్తాబయ్యాయి. విద్యుత్ కాంతులతో సుందరీకరించారు. జిల్లా కేంద్రంలోని కేస్లాపూర్ వీరంజనేయ స్వామి ఆలయం మరో కొండగట్టుగా విరాజిల్లుతున్నాడు. బజార్‌వాడీ, కంచుకోట, హీరాపూర్, టీఆర్ నగర్, బ్రాహ్మణవాడ, జన్కాపూర్, గంగపుత్రకాలనీల్లో హనుమాన్ ఆలయాల్లో కమిటీ ఆధ్వర్యంలో జయంతిని అన్ని ఏర్పాట్లు చేశారు.

కేస్లాపూర్ హనుమాన్..

కేస్లాపూర్ వీరంజనేయ ఆలయ అభివృద్ధి, వసతుల పెంపునకు భక్తులు, ప్రముఖుల సహకారం విశేషంగా లభిస్తోంది. ఆలయంలో మొక్కు చెల్లించుకునేందుకు తెలంగాణ, ఏపీ నుంచే కాక మహారాష్ట్ర నుంచి వేలాది వస్తుంటారు. ఆలయ పునరుద్ధరణ, వసతుల కల్పనకు భక్తుల సహకారంతో ఆలయకమిటీ కృషిచేస్తోంది. స్థానిక ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ సహకారంతో రూ.10 లక్షల అంచనాతో శుభకార్యాల వేదిక నిర్మించారు.

ఆలయ ప్రాశస్త్యం

పట్టణానికి ఈశాన్య ప్రాంతాన ఉత్తర వాహిణి పెద్దవాగు తీరాన మరో కొండగట్టు పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న కేస్లాపూర్ వీరాంజనేయ స్వామి ఆలయానికి ప్రత్యేక చారిత్రక నేపథ్యం ఉంది. గోండురాజుల కాలంలో కేస్లాపూర్‌లో విశేష పూజలందుకున్న వీరాంజనుయుడు భక్తులకు కొంగుబంగారంగా చెప్పుకొంటారు. ఈ ఆలయ ముఖద్వార సమీపంలో రూ.8 లక్షలతో 41 అడుగుల ఎత్తుతో ఏర్పాటు చేసిన అభయాంజనేయ స్వామి భారీ విగ్రహం పట్టణానికి క్షేత్ర పాలకుడిగా ఉన్నాడు. ఈ ప్రాంగణాన్ని ఆహ్లాదంగా తీర్చిదిద్దే ప్రణాళికలు సిద్ధంగా ఉన్నాయి.

నేటి పూజా కార్యక్రమాలు

కేస్లాపూర్ హనుమాన్ ఆలయంలో మంగళవారం ఉదయం 5 గంటలకు సుప్రభాత సేవతో ప్రారంభమై, 5.30 కలశ గణపతిపూజ, పుణ్యావచనం, అఖండ దీపారాధన, 6 గంటలకు ధ్వజారోహణం, హారతి, 6.30కి నవగ్రహ స్థాపన, పూజా, 7.30కి శ్రీ ఆంజనేయ స్వామికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, 8.30కి సహస్ర తమలాపత్ర, సహస్ర ఫలపుష్పార్చన, 9 గంటలకు నవగ్రహ, రుద్రహోవనం, బలిహరణం, పూర్ణాహుతి, 9.40కి మంగళహారతి, మహా మంత్రపుష్పం, తీర్థ ప్రసాద వితరణ, 10 గంటల నుంచి మహాప్రసాద (అన్నదానం) కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కమిటీ ప్రతినిధులు పేర్కొన్నారు.

23 ఏళ్లుగా సేవ



గత 23 ఏళ్లుగా ఆలయంలో అర్చకుడిగా సేవ చేయడం తన అదృష్టం. ఏటా నిర్వహించే హనుమాన్ జయంతి ఉత్సవాలకు భక్తులు తరలివస్తారు. మరో కండగట్టుగా ఈ ప్రాంత భక్తులు కొలుస్తారు. ఆలయ కమిటీ, ప్రముఖులు, భక్తుల సహకారంతో ఆలయం దినదినాభివృద్ధి చెందుతుంది.

– ఒజ్జల శిరీష్‌శర్మ, కేస్లాపూర్ హనుమాన్ ఆలయ అర్చకుడు

మల్కేపల్లిలో సీసీ కెమెరాల ఏర్పాటు

కాసిపేట: మండలంలోని దేవాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మల్కేపల్లిలో సోమవారం దేవాపూర్ ఎస్సై ఆంజనేయులు సీసీ కెమెరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. ఏదైనా నేరం జరిగిన క్రమంలో నేరస్తులను పట్టుకోవడానికి సీసీ కెమెరాలు ఉపయోగపడతాయని, మల్కేపల్లిలో కూడళ్ల వద్ద ఐదు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, పోగ్రాం రూంను ప్రారంభించినట్లు తెలిపారు. ప్రతి గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు గ్రామస్తులు సహకరించాల్సిందిగా కోరారు. పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భూమి పరిరక్షణతోనే మనుగడ

కోటపల్లి: పర్యావరణాన్ని కాపాడుతూ భూమిని పరిరక్షించుకోవడంపైనే భవిష్యత్తులో మానవాళితో పాటు సమస్త జీవరాశుల మనుగడ ఆధారపడి ఉందని అటవీ అభివృద్ధి సంస్థ మంచిర్యాల రేంజ్ ప్లాంటేషన్ మేనేజర్ గోగు సురేష్‌కుమార్ తెలిపారు. ప్రపంచ ధరిత్రి దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం మండలంలోని సర్వాయిపేట సమీపంలోని అటవీ అభివృద్ధి సంస్థకు చెందిన నీలగిరి ప్లాంటేషన్, పరిసర అటవీ ప్రాంతంలో పేరుకు పోయిన ప్లాస్టిక్ వ్యర్థాలను ఇష్టారాజ్యంగా పడేస్తున్నారన్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలను వాచర్ల సహాయంతో తొలగింపజేశారు. వేసవిలో అడవుల్లో అగ్ని ప్రమాదాల బారిన పడకుండా ప్రతి ఒక్కరూ అటవీశాఖ వారికి సహకరించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఫీల్డ్ సూపర్‌వైజర్ శ్రీనివాస్, వాచర్లు సాయికిరణ్, లచ్చన్న, ఓదేలు పాల్గొన్నారు.



సర్వాయిపేట అడవిలో తొలగించిన ప్లాస్టిక్ వ్యర్థాలు

ఆర్టీసీ కార్మికులకు వైద్య పరీక్షలు

మంచిర్యాలఅర్బన్: ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేరవేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు ఒత్తిడితో అనారోగ్య పాలవుతున్నారు. పనిఒత్తిడి, అవిశ్రాంతితో మానసిక ఆందోళనకు గురవుతున్నారు. ఉద్యోగుల అనారోగ్య పరిస్థితులను గమనించిన తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ గ్రాండ్ హెల్త్ ఛాలెంజ్–2లో భాగంగా డిపోల వారీగా వైద్య శిబిరాలు నిర్వహిస్తోంది. ఈ నెల 18 నుంచి కార్మికులకు మధుమేహం, రక్తపోటు, ఈఎన్‌టీ, కిడ్నీ లివర్, గుండె తదితర 17రకాల పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు 380మంది కార్మికులకు పరీక్షలు నిర్వహించినట్లు డీఎం రవీంద్రనాథ్ తెలిపారు.



కార్మికులకు వైద్య పరీక్షలు